క్లుప్తంగా...

సైబజార్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సాయినాథ పురం కాలనీలో శుక్రవారం సైబజార్ (వారాంతపు సంత) ఉంటుంది.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో శుక్రవారం హోమియో వైద్యం, జనరల్ చికిత్సలు నిర్వహిస్తారు.

శివాజీపై దాడికి పాల్పడిన నిందితుల గుర్తింపు

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ కృష్ణానగర్ కాలనీలో రెండు రోజుల క్రితం దాడికి గురైన ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీపై దాడికి పాల్పడిన నిందితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని వారిలో ఆరె సంఘం మాజీ అధ్యక్షుడు కిషన్‌రావు కుమారుడు నానాజీ ఉన్నట్లు గుర్తించామన్నారు. మిగితా నిందితుల ఆచూకి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

బోడుప్పల్: సవరణ బడ్జెట్‌పై శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బోడుప్పల్ ఇన్‌చార్జి కమిషనర్ వాణిరెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. కార్పొరేటర్లు పాల్గొని బడ్జెట్‌పై చర్చించాలని కోరారు. పలు సూచనలు, సలహాలు అందించాలని ఆమె సూచించారు.

జవహర్‌నగర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సురేందర్‌రావు



కాప్రా: జవహర్‌నగర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఏఎస్‌రావునగర్‌కు చెందిన పెంచాల సురేందర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని సుమారు 37 మున్సిపాలిటీలకు స్టాండింగ్ కౌన్సిల్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా జవహర్‌నగర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా సురేందర్‌రావును నియమించారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోడుప్పల్: బోడుప్పల్ ఇందిరానగర్ చౌరస్తాలో గురువారం దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రథమ సభల గోడ పత్రికను సీపీఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆవిష్కరించారు. మొదటి మహాసభను మార్చి 31వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దండు రమేష్, మాచర్ల కనకయ్య, నాయకులు సోమరాజు, లక్ష్మమ్మ, నాగారపు రజిత, మాధవ్, స్వరూప, సత్యమ్మ పాల్గొన్నారు.

సురేందర్‌రావుకు సత్కారం



సురేందర్‌రావును సత్కరిస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

కుషాయిగూడ: జవహర్‌నగర్ మున్సిపాలిటి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన న్యాయవాది పెంచాల సురేందర్‌రావును గురువారం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్, రేగళ్ల సతీష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్, బాల్‌నరసింహ, సందీప్ సుభాష్, న్యాయవాది యాట భాస్కర్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషిన్లు అందజేత

కీసర: అహ్మద్‌గూడలోని పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మెషిన్లు అందించడం అభినందనీయమని నిలోఫర్ డెంటల్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం అహ్మద్‌గూడలోని షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



అల్వాల్ సాయిబాబా ఆలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



అల్వాల్‌లో.. వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

కమనీయం.. సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఉప్పల్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రామాలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద, అన్ని కాలనీలు, బస్తీల్లో చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు సీతారాముల కల్యాణ ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. పానకం, వడపప్పును భక్తులకు ప్రసాదంగా అందజేశారు. పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తునఅన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల్లో వైభవంగా శోభాయాత్రలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేడుకల్లో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

– ఉప్పల్, మల్కాజ్‌గిరి జోన్ల బృందం



వేడుకల్లో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి



సీతారాములకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న బొంతు రామ్మోహన్ దంపతులు



శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న తోటకూర వజ్రేష్‌యాదవ్



శ్రీరామనవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్పొరేటర్ శ్రీవాణి



వేడుకల్లో పాల్గొన్న బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్ అనిత



మంగపురంలో.. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



విష్ణుపురికాలనీలో కార్పొరేటర్ శ్రవణ్



మల్కాజిగిరిలో శోభాయాత్ర



కల్యాణోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ గీతాప్రవీణ్‌ముదిరాజ్



కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ దంపతులు



నేరేడ్‌మెట్ శ్రీ కాలనీలో పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం



చక్రిపురం కాలనీలో..



వెంకటాపురంలో.. కార్పొరేటర్ సబితాకిషోర్



మచ్చబొల్లారంలో.. ప్రజా గాయకుడు గద్దర్



నాచారంలో..



శోభాయాత్రను ప్రారంభించిన బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ మేకల సునీతాయాదవ్



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, హనుమంతు తదితరులు



వేడుకలకు హాజరైన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పించాలి



రామంతాపూర్: ఇందిరానగర్‌లోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుబాష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు మానవీయ విలువలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ గాదె సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కల దాడి



బాలుడి కాలిపై కుక్క కరిచిన గాయాలు

మల్లాపూర్: ఆరు బయట ఆడుకుంటున్న ఓ బాలుడు, బాలికపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన గురువారం నాచారంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన రష్మిక (04), ఇందిరానగర్‌కు చెందిన ఆదర్శ్(11) సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేసి కాళ్లు, చేతులపై కరిచాయి. చికిత్సం నిమిత్తం వారిని నాచారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అదుపు తప్పిన బైక్.. వ్యక్తి మృతి

కుషాయిగూడ: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. చర్లపల్లి మధుసూదన్‌రెడ్డి కాలనీకి చెందిన కొడిమల్ల ప్రణయ్ (27) రాంపల్లిలోని ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి మిత్రులతో కలిసి మద్యం తాగాడు. ప్రణయ్ ఇంటికి వెళ్తున్న క్రమంలో తన మిత్రుడి నుంచి ఫోన్ వచ్చింది. తన బైక్‌లో పెట్రోల్ అయిపోయిందని, తీసుకురావాలని కోరాడు. దీంతో బాటిల్‌లో పెట్రోల్ తీసుకెళ్లి మిత్రుడికి ఇచ్చిన అనంతరం ఈసీఐఎల్ నుంచి చర్లపల్లి వైపు వెళ్తుండగా గణేష్ కమాన్ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన ప్రణయ్ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాద విషయాన్ని పోలీసులకు తెలిపాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కెన్యాలో తేనెటీగల దాడిలో నగరవాసి మృతి



బ్రహ్మచారి (ఫైల్)

ఉప్పల్: కెన్యాలో జరిగిన తేనెటీగల దాడిలో నగరానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి సోదరుడు జితేంద్రాచారి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపుర మండలం ధర్మారావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మచారి(55) దంపతులు ఉప్పల్‌లోని కావేరినగర్‌లో నివాసముంటున్నాడు. మూడేళ్ల క్రితం కెన్యా దేశంలోని టాంజనియా రాష్ట్రంలో వ్యవసాయం చేయడానికి వెళ్లాడు. అక్కడ వ్యవసాయ క్షేత్రాలను లీజుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంట చేలలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా బ్రహ్మచారిపై తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భారత కాలమాన ప్రకారం గత సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. బ్రహ్మచారికి ఇద్దరు కుమార్తెలు శ్రుతి, శ్రావిక ఉన్నారు. పెద్ద కూతురు శ్రుతికి వివాహం అయ్యింది. వచ్చే సోమవారం ఉప్పల్‌కు బ్రహ్మచారి మృతదేహాన్ని తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



మల్కాజిగిరి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జుననగర్‌కు చెందిన బొండ్ల ప్రకాష్ జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 30న తెల్లవారుజామున ప్రకాష్ తల్లిదండ్రులు అయోధ్య టూర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. కొద్ది సేపటి తర్వాత బయటకు వెళ్లిన ప్రకాష్ తండ్రి నర్సింహ(75) ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకి కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన డిపో మేనేజర్ చంద్రకాంత్

అల్వాల్: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓల్డ్ అల్వాల్‌లో సామాజిక కార్యకర్త వేమూరి గణేష్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాయిరామ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చలివేంద్రాల ఏర్పాటుతో బాటసారుల దాహం తీర్చవచ్చన్నారు. కార్యక్రమంలో రాజసింహారెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బలవంత్‌రెడ్డి, చంద్రశేఖర్, వీవీరావు, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో..

కాప్రా: ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రకాంత్ ప్రారంభించారు. ఆర్టీసీ ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు వేసవి కాలంలో గత ఐదేళ్ల నుంచి చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కుషాయిగూడ డిపో అసిస్టెంట్ మేనేజర్ రజిత, ఆర్టీసీ సిబ్బంది, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సోలిస్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో..

సోలిస్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ అధినేత రాము తెలిపారు. ఈసీఐఎల్ చౌరస్తా, రాధిక చౌరస్తా, వంపుగూడలోని జీ స్కూల్ సమీపంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.



ఓల్డ్ అల్వాల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి